


రావిపాటి ఇందిరామోహన్

అందమె ఆనందం...

అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ తన్మయత్వంతో కూనిరాగాలు తీస్తూ... ముఖానికి తుది మెరుగులు దిద్దుకుంటోంది. లలిత. విశాలమైన నుదురు, కోటేరు వంటి నాశిక, కాంతులు చిమ్మే మీనాల్లాంటి నేత్రాలు, బంగారు మేనికాంతి... అందానికే అందం కూర్చేలా ఉంది - ఆమె అందం.

ఆ రోజు కాలేజీలో వక్తృత్వపోటీ ఉంది. అందుకే అంత అలంకరణ! ఆకుపచ్చని జరీ బోర్డరున్న వంకాయరంగు పట్టుపరికిణి, ఆకుపచ్చ పయిట, మ్యాచింగ్ జాకెట్టూ - లలిత మెరిసిపోతోంది.

లలిత తల్లి సుభద్ర వంటగదిలో కుస్తీ పడ్తోంది. బాక్సు సర్దుకోమని లలితను కేకలు పెడ్తోంది. ఆ కేకలు లలిత చెవుల్లో దూరితేనా? అదే తన్మయత్వం!

"నేనిక్కడ వంటకాక చస్తూంటే... పాటలేమిటి!" ఆమె హూంకరించింది.

"ఏమిటమ్మా నీ గోల..." తనని డిస్టర్బ్ చేసినందుకు లలిత విసుక్కుంది.

తన అందం చూసి ఏ రాకుమారుడో వచ్చి తనని వివాహం చేసుకుంటాడని ఆమె ఊహ. ఇప్పుడు రాకుమారులు ఎక్కడ ఉన్నారు?... ఏ కుబేర సంతతిలోని మన్మధుడో ఊడిపడ్తాడని ఆమె ఆశ.

మధ్యతరగతి జీవితాలంటే లలితకు పరమ అసహ్యం. అవసరాలెన్నో! చాలీచాలని జీతం. తల్లి ఇచ్చే నాలుగు రూపాయల్తో కాలేజీకి వెళ్లి రావడం ఎంత కష్టంగా ఉందో! మాట్లాడితే లెక్కలు. వాళ్లకర్థమైఏడిస్తేగా...? లలితలోని అక్కసు.

తల్లి ఇంకా కేకలు పెడ్తూ ఉండడంతో అయిష్టంగానే కదిలింది. "ఎందుకమ్మా ఆ కేకలు? నాలుగు వందలు కడితే హాస్టల్లో ఉంటున్న వారితో బాటు మాకూ వేడి భోజనం పెడ్తారు. వండే పని నీకు, ఆ చల్లటి కూడు తినడం నాకూ తప్పేది. ఈ రోజు నేను 'బాక్సు' తీసుకువెళ్లను. ఒక ఇరవై రూపాయలివ్వు. క్యాంటీన్‌లో ఏదైనా తింటాను".

"నా దగ్గర అంత డబ్బెందుకుంటుంది? నాన్నగారు ఆఫీసుకు వెళ్లక ముందు అడిగి తీసుకోమని నీకెన్నిసార్లు చెప్పాను?" కసురుకుంది సుభద్ర.

"ఆయన ఇస్తాడేమిటి? లెక్కలు చిట్టా విప్పి, నా బుర్ర తినేస్తాడు".

"నీఒక్కదానివైతే... ఎలానో వాడొచ్చు.

ముగ్గురి చదువు ఖర్చంటే మాటలా?"

"అంత పెట్టలేనప్పుడు ఒక్కరితే సరిపెట్టుకో వచ్చుగా?"


"ఆ సంగతి మాకప్పుడు తెలియలేదు. నీవు జాగ్రత్తపడుదువుగాని" సుభద్ర మామూలుగానే అన్నా లలితకు కోపం వచ్చింది. విసవిసా వీధిలోకి వెళ్లింది.

కాస్త టైము దొరికితే చాలు... లలిత ఊహల్లో తేలిపోతుంది. అప్పుడే ఆమె తన బాధల్ని మరిచిపోగలుగుతుంది. మనస్సుకు ఊరట లభిస్తుంది. ఇంకా బాగా చెప్పాలంటే... ఆమె ఆహ్లాదంగా, ఆనందంగా ఉండే క్షణాలవే.

ఇంకెన్నాళ్లు ఈ బాధలు? ఎలాగో ఒకలా ఈ సంవత్సరం ఓర్చుకుంటే ఏ మినిష్టర్‌గారి అబ్బాయో వచ్చి తనని ప్రేమిస్తాడని, కొన్ని రోజులు కష్టాలు పడ్డా... చివరకు తెలుగు సినిమాలోలాగ తనని వివాహం చేసుకుంటాడని... అప్పుడు హాయిగా ప్రియుని ప్రక్కన ఇంపాలా... కారులో...

"ఏయ్! లలితా! ఏ లోకంలో వున్నావు?" క్లాస్‌మేట్ గీత వీపుపై చరచడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చిన లలిత ఆమె వెనుకనే జనంతో కిటకిటలాడుతున్న బస్సులో ఎక్కింది.

లలిత ఆశించినట్లు ఏ మినిష్టర్‌గారబ్బాయి ఆమెని ప్రేమించలేదు. పైసా కట్నం లేకుండా ఎగరేసుకునీ పోలేదు. బి.ఎ. అయిపోతూనే ఆమె తండ్రి ఇంక చదివించలేనని, సంబం



ధాలు చూడడం మొదలుపెట్టాడు. ఎన్ని సంబంధాలు చూసాడో... ఒక్కటీ కుదరలేదు. డబ్బు, అందం వున్నవాడు అసలు కనిపించలేదు. డబ్బు లేకపోయినా ఫర్వాలేదు. తను ఉద్యోగం చేస్తుంది. అందగాడై వుండాలని కోరుకుంది. కాని లలితకు నిరాశే ఎదురయింది. ఉద్యోగం మాత్రం చూసి, నల్లని రంగున్న వాడితో ఆమె వివాహం నిశ్చయించారు.

బొత్తిగా కాకిరంగు... ఎలా చేసుకోవడం? చూడడానికే బాధగా ఉంది. భర్తగా భరించలేదు. చేసుకోనని లలిత ఏడ్చి గోలపెట్టింది. నిరాహారదీక్ష ప్రారంభించింది. ఈమె మొండి అయితే... ఆ తండ్రి జగమొండి. పట్టిన పట్టు వీడలేదు.

ఆ వివాహం నుంచి తప్పించుకోవడానికి ఇంట్లో నుంచి పారిపోదామా అని చూసింది. పారిపోయి ఏమి చెయ్యడం? తనకో బాయ్ ఫ్రెండ్ ఉన్నా... అతని సాయంతో సాధించుకోవచ్చు. ఏ దిక్కూ లేకుండా... బయటకు వెళ్లి బ్రతకటమెలా? ఏ గూండాల బారినో పడితేనో? సుఖాన వున్న ప్రాణాన్ని ఎందుకు కష్టపెట్టుకోవడం? అమ్మదగ్గరైతే అరచి, గోలపెట్టి ఇప్పటివరకూ తన అవసరాలు తీర్చుకోగలిగింది. తండ్రితో గట్టిగా మాట్లాడలేదు. బయట సమాజంలో బ్రతికే సాహసం చేయలేకపోయింది. ఆశించినది పొందేందుకు... జీవితాన్ని ఒక సవాల్‌గా తీసుకోలేకపోయింది. పరిస్థితులకు తలఒగ్గి... ఏడుస్తూనే వివాహం చేసుకుంది. డబ్బున్న అందగాణ్ని చేసుకుంటానని స్నేహితుల్తో కోసిందిగా! వాళ్లు నవ్వుతారేమోనని - ఎవర్నీ వివాహానికి పిలువలేదు.

వివాహమైన తర్వాతన్నా తన జీవితం మారుతుందని అనుకుంది. జీవన ప్రమాణాల్లో ఎటువంటి మార్పూ లేదు. మార్పల్లా... కొత్త వ్యక్తులు, కొత్త పరిసరాలూను. అదేదో సామెత చెబుతారే... పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయింది.

కోరికలు తీర్చుకోలేని తన అసమర్థతపై కోపం, కసి, ప్రక్కవారిపై విరుచుకుపడడం - లలిత తన జీవితాన్ని నరకంగా చేసుకుంటోంది. చదువుకునే రోజుల్లో కాస్త ఇంటిపని చేసి ఉంటే... ఎలా ఉండేదో? ఏ కొంచెం పనిచేసినా... అలసిపోతూంది. జ్వరం కూడా వస్తూఉంది. అందమైనదని... మోజుపడి లలితను పెళ్లి చేసుకున్నాడు ముకుందం. ఆమెను సంతోషపెట్టేందుకు అధిక గంటలు పని చేస్తున్నాడు. ఆమెకు సపర్యలన్నీ చేసి ఆఫీసుకు వెళుతున్నాడు. అలా చేయడం వలన ఒక షికారు, సినిమా కూడా కరువయ్యాయని - ఆమె మరో ఏడ్పుకి కారణమయింది. జీవితం తానాశించినట్లు లేనపుడు - ఓ ఛాలెంజ్‌గా తీసుకుని, పైకి వెళ్లడం ఎలా...? అని చక్కగా ప్లాన్ చేసుకోవాల్సింది. ప్రైవేట్‌గా ఎం.ఎ. పరీక్ష వ్రాసి, మంచి ఉద్యోగం సంపాదించుకోవచ్చు. లేకుంటే బ్యాంక్ లోన్ తీసుకుని చిన్న ఇండస్ట్రీ

## నిద్ర లేవనుగా...

జడ్జి ఓ ఖైదీకి ఉరిశిక్ష విధించి, ఆ తీర్పుని 29వ తేదీ తెల్లవారు జామున 4 గంటలకు అమలు చేయవలసిందిగా ఆర్డర్ వేసాడు.

తీర్పు విన్న ఖైదీ పకపకా నవ్వాడు?

ఎందుకు నవ్వుతున్నావ్? కోపంగా ప్రశ్నించాడు జడ్జి.

నేను ఉదయం 8 గంటలు దాటితేగానీ లేవను... మీ తీర్పు ఎలా అమలు చేస్తారు? ఖైదీ తిరిగి ప్రశ్నించాడు.

పెట్టుకుని - జీవితంలో ఎందరు అభివృద్ధి సాధించడంలేదూ? లలిత అలా ఆలోచించ లేదు. ఎంతసేపటికీ భర్త తనని సంతోషపెట్టలేక పోతున్నాడని - అతనిపై కోపం పెంచుకుంది. తన కోపమే తన శత్రువని - సుమతీ శతక కారుడు ఎప్పుడో చెప్పనే చెప్పాడు. చీటికీ మాటి కీ అనారోగ్యం. ఒక చిన్న ఉద్యోగం కూడా సంపాదించలేకపోయింది లలిత. ఇది చాలద న్నట్లు ఇప్పుడామె గర్భవతి.

ఒక అందమైన పాపకు తల్లికాబోతున్నట్లు ఊహల్లో తేలిపోయింది. ఇక్కడా ఆమెకు నిరాశే ఎదురయింది. ఆడపిల్లే పుట్టిందిగానీ, నల్లపిల్ల! ఆ పాపను చూసి లలిత ఏడ్చింది. పాపకు పాలు కూడా ఇవ్వలేదు. పురిటికందు ఆకలి గ్లూకోజు నీళ్లతో తీర్చారు. మూడోరోజు డాక్ట రమ్మ చీవాట్లు పెట్టడంతో అయిష్టంగానే పాలి చ్చింది. ఆ పాపను చూస్తే ప్రేమ కలగలేదు. ప్రక్కబట్టలు తడిచినా మార్చదు. చాలావరకూ ఆ పాప పనులన్నీ ముకుందమే చేయసాగాడు. అతని కష్టం చూడలేక సుభద్ర వచ్చి పాపను తనతో తీసుకెళ్లింది. లలిత రిలీఫ్ ఫీలయింది. జాగ్రత్త పడకపోవడంతో లలిత రెండోసారి గర్భవతి అయింది. ఈసారి ఏ దేవుడు ఆమె మొర ఆలకించాడో...? లలితకన్నా అందమైన పాప పుట్టింది. లలితకు ఆ పాపే లోకమైంది. 'కుయ్'మని కూడా అననివ్వదు. ఎత్తుకుని ముద్దులు కురిపిస్తుంది. పెద్దపాప 'వాణి' ప్రక్కనే ఉన్నా... ఆ పాపకు ఒక్క ముద్దు కూడా పెట్టదు.

వాణికిప్పుడు ఐదు సంవత్సరాలు. కాస్త ఊహ తెలుస్తోంది. వయస్సును మించి ఆలో చన్లు. తల్లినంటిపెట్టుకునే తిరుగుతూ ఉం టుంది. అమ్మమ్మతో వెళ్లనంది. తల్లి, చెల్లికి ముద్దుపెడుతుంది. ఇక్కడే ఉంటే తనని కూడా ముద్దుపెట్టుకుంటుందని... ఆ చిన్నిప్రాణి ఆశ పడింది. కానీ లలిత దృష్టంతా చిన్నకూతురు రాణిపైనే.

లలిత ఉద్యోగంలో చేరింది. చిన్న కూతు రికి ఎన్నో డ్రస్‌లు, బొమ్మలూ కొంది. పెద్ద పిల్లకు 'కొనలేదే'మని భర్త అడిగితే "పాత బొమ్మలు చాలానే ఉన్నాయిగా" అంది. ముకుం దం ఏమీ అనలేక మౌనం వహించాడు.

లలిత ఉద్యోగ వైభోగం రెండు నెలలే. ఒక నాడు ఆఫీసుకు ఆటోలో వెళ్తుండగా... ఆటోకి యాక్సిడెంట్ అయింది. లలితకు ప్రాణభయం లేదు కానీ, ఆమె కాలి ఎముక రెండుచోట్ల విరిగింది. ఆసుపత్రి నుంచి బయటకు రావడా నికి రెండునెలలు పట్టింది.

ఇప్పుడు లలిత ఊతకర్ర సాయంతో మెల్లగా తన పనులుతాను చేసుకోగలుగు తోంది. ఆమెలో దూకుడు తగ్గింది. ఆలోచనా ధోరణిలో కూడా మార్పు వచ్చింది. ముకుందం కూడా ఆ మార్పు గమనించాడు.

తనెంతో అందగత్తెనని విర్రవీగింది. ఏమైం దా అందం? బాహ్యసౌందర్యం క్షణికం! అంతః సౌందర్యమే ముఖ్యమని ఆమె తెలుసుకోగలి గింది.

ఆ రోజు వాణి స్కూలు నుంచి వస్తూనే... వంటగదిలోకి వెళ్లింది. బత్తాయి రసం తీసింది. ఆ జ్యూస్ గ్లాస్ తెచ్చి తల్లికి అందించింది.

చిన్నపిల్ల అలా చేయడం చూసి లలిత కరిగి పోయింది. ఆమెలో వాణిపట్ల మమకారపు పొంగు... గబుక్కున వాణిని తన ఒడిలోకి లాక్కుని ముఖంపై ముద్దులవర్షం కురిపిం చింది. వాణి తల్లిని కరుచుకుపోయింది.

లలిత కళ్లు వర్షిస్తున్నాయి... అవి ఆనంద భాష్పాలు. ●